తిరిగిరాని ఖైదీలు

సంపత్

దూరంగా ఏదో ట్రక్ వస్తున్న చప్పుడు విన్పించి, చిన్నగా ఉలిక్కిపడ్డాను.

ఇక్కణ్నుంచి సుమారు ఫర్లాంగుదూరంలో ఉంటుంది కొండ. నిట్ట నిలువుగా, ఎక్కటానికి వీలులేకుండా స్టీప్‌గా ఉంటుంది. దాని పక్కనే పడమరగా ఉంది చిన్న తారు రోడ్. రోడ్డుకి అవతల అయిదారు గజాల తరువాత లోయ.

ఆ లోయ అంతా దట్టమైన చెట్లు చేమలతో నిండి, భయంకరంగా ఉంటుంది. ప్రస్తుతం నేను ఆ లోయలోనే ఉన్నాను.

లోయ అంతా నిశ్శబ్దంగా వుండి, భయం గొలుపు

తూంది. పక్షుల కేకలు, శబ్దాలు తప్ప మరో శబ్దం లేదు. ఆ లోయలో భయంకరమైన క్రూర జంతువులు మాత్రం లేవని తెలుసు.

లేచి దట్టమైన చెట్లగుండా నడక ప్రారంభించాను. ఎండుటాకులు నా బూటుకాలు క్రిందపడి పెళపెళ విరిగిపోతూ శబ్దం చేస్తున్నాయి. నా చేతికి ఉన్న వాచీ మధ్యాహ్నం రెండు గంటలు చూపుతోంది.

లోయ అంచు వద్దకు వచ్చాను. మా ఉనికి తెలియకుండా, మారాక పోకలకు అనుగుణంగా లోయ అంచువద్ద మేము ఎనుకున్న మార్గం ఒకటి ఉంది. అది అంత సులభంగా ఇతరుల కళ్ళబడదు.

ట్రక్ శబ్దం మరింత దగ్గరయింది.

ఈ సమయంలో ఎక్కణ్నుంచి వస్తోంది? ఎవరెవరున్నారు? ఎక్కడికి వెళ్ళుతున్నారు? ఈ ఆలోచనలతోనే ట్రక్ శబ్దం వస్తున్న వైపుకి నడిచాను.

అప్పుడే కొండదగ్గర అంచుదగ్గర మలుపు తిరిగింది ట్రక్. లోపల కేరింతలు, కోలాహలం విన్పిస్తోంది. ట్రక్‌ను చూడగానే చటుక్కున ప్రక్కనే ఉన్న చెట్టుచాటుకి నక్కాను.

చాలా పాతకాలంనాటి ట్రక్ అది. ట్రక్ అంతా లూజు లూజుగా ఉండి ఏ క్షణంలో కూలబడి పోతుందో నన్నంతగా ఉంది చూపులకి. కాని దాని రన్నింగ్ మాస్తూంటే యింజన్ మాత్రం క్రొత్తదిలా ఉంది.

ట్రక్ ఫ్రంట్ సీట్లో ముగ్గురు వ్యక్తులున్నారు. ఒకడు డ్రైవ్ చేస్తున్నాడు. మిగిలిన యిద్దరూ అటూ ఇటూ

చూస్తూ పరిసరాలను పరిశీలిస్తున్నారు. వారి వాలకం గమనించి మరింతగా నక్కాను నేను. ట్రక్ లోపల చాలా మంది ఉండి ఉండాలి. కోలాహలంగా ఉంది.

"కైనా" దేశానికి సంబంధించిన ట్రక్ అది. అందులోని సైనికులు కూడా 'కైనా' దేశస్థులే. చిన్నగా నవ్వుకున్నాను నేను. ఈ క్షణంలో ఎంతో ఆనందంగా ఉన్నారు. మరుక్షణంలో ఏమవుతుంతో వారికి తెలియదు.

ట్రక్ నన్ను దాటింది. నన్ను చూడలేదు ఎవరూ.

కొండనుదాటి ముందుకు పోయింది. నేను జాగ్రత్తగా గమనిస్తున్నాను. మరికొంత దూరం పోయింది.

అంతే!...

భయంకరమైన పెద్ద విస్ఫోటం. ట్రక్ తుత్తినియలయి పోయింది. ట్రక్ పార్టులతోబాటు, సైనికుల శవాల ఖండాలుకూడా మండుతూ గాలిలోకి ఎగిరాయి. భయంకరమయిన మంటల్లో మండుతూ నిలబడిపోయింది ట్రక్.

గాలి బాగా వీస్తూండటంవల్ల మంటల శబ్దాలు విన్పిస్తున్నాయి బాగా. తృప్తిగా నవ్వుకొని, దిగి లోయవేపు నడక సాగించాను.

2

బాంగ్లాదేశ్ యుద్ధం జరుగుతున్న సమయం. ఒకవైపు బంగ్లాదేశ్ శరణార్థుల రక్షణ, మరోవైపు పాకిస్తాన్‌తో యుద్ధం. భారతదేశం అత్యంత జాగరూకతతో ఉంది. శత్రువులు, దేశంలోని అరాచకశక్తులు కల్సిపోయి, దేశనాశనానికి దారితీసే సమయం యిదే. అందుకనే భారతదేశం దేశంలోని అంతరంగిక శత్రువుల్ని ఏరివేస్తూనే, మరోవైపు సరిహద్దువద్ద సైనికుల్ని 'అలెర్ట్' చేసింది.

అస్సాం సరిహద్దుల్లో ఉన్న మేము, 'కైనా' సైనికులు కవ్వింపుల్ని చాలారోజులు సహించి, చివరకు సహించలేక ముందుకు దూసుకుపోయాము. మా విజృంభణచూసి 'కైనా' సైనికులు వెనుకంజవేశారు.

నేను, మరో వ్యక్తి హరిపాల్ ఆ లోయలో ఉన్న సామానులకు రక్షణగా నియమించబడ్డాము. మా వాళ్లతో వెళ్ళి శత్రువుల్ని చీల్చి, చెండాడాలని ఉన్నా, మేజర్ ఆజ్ఞమీద అక్కడే ఉండిపోయాము.

సైనికులమీద దాడి జరిపి విజయ పరంపరతో తిరిగి వస్తూన్న మా వాళ్ళమీద; హఠాత్తుగా 'కైనా' సైనికులు గెరిల్లా యుద్ధం జరిపి చంపేశారు.అందరూ చనిపోయారు. నేను, హరిపాల్ మాత్రం ఇక్కడ మిగిలిపోయాము.

మొదట విచారించినా, తరువాత తెల్సిన విషయం విని మామీద మెరుపుదాడి జరిపిన కైనా సైనికులమీద ప్రతీకారం తీర్చుకోవటానికి భలే అవకాశం దొరికినందుకు సంతోషించాము.

సరిహద్దుల్లో ఉన్న 'కైనా' సైనికులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. ఆహార పదార్థాలు తెస్తున్న వాన్లు, అకస్మాత్తుగా మాయమవటం, ఉన్నట్లుండి భగ్గున మండిపోవటం, లోయల్లోకి దొర్లిపోవటం సాగించాయి.'కైనా' సైనికులు క్షుణ్ణంగా, ప్రతి అంగుళాన్ని గాలించినా, మేము దొరకలేదు.

హరిపాల్ చాలా తెలివయినవాడు. మా క్వార్టర్స్‌కి తిరిగి వెళ్ళకుండా ఇక్కడే శత్రువులతో "సరసాలు" ప్రారంభించటం అతని అయిడియానే.

దానికీ కారణం లేకపోలేదు. ఇద్దరం బ్రహ్మచారులం.

నా అన్నవాళ్ళు నాకూ, అతనికీ లేరు. కావల్సినంత ఆహార పదార్థాలు, అమ్యూనిషన్ సమృద్ధిగా వున్నాయి. శత్రువుల్ని ముప్పుతిప్పల్ని పెట్టటానికి నిర్ణయించుకున్నాము.

మే మాడుతున్న "జూదం" చాలా ప్రమాదకరమైన దని తెల్సు. మా నీడ దొరికినా మమ్మల్ని కాల్చివేస్తారు శత్రువులు. అందుకే కొంతకాలంపాటు మా చర్యల్ని నిలిపేశాము. వారం రోజులపాటు కైనా సైనికులు ఊపిరి పీల్చుకున్నారు.

తిరిగి మా చర్యల్ని ప్రారంభించటానికి నాందిగా ఈ రోజు రోడ్ మీద గుంటలుతీసి బాంబులు పూడ్చాము జాగ్రత్తగా. వాటికేమాత్రం వత్తిడి తగిలినా పేలుతాయి.

అడవిలోనికి ఏదో పనిమీద వెళ్ళాడు హారిపాల్. ఆ సమయంలోనే నేను ట్రక్ శబ్దం వినటం, దాన్ని స్మాష్ చేయడం జరిగింది.

3

నేను లోయలోనికి తిరిగి వచ్చేసరికి హారిపాల్ ఆదుర్దాగా ఎదురుచూస్తూ కన్పించాడు.

అయిదున్నర అడుగుల మనిషతను. లావుగా, దృఢంగా వుంటాడు. బుర్రమీసాలు. కొద్దిగా పొట్ట వుంది. నిద్ర లేకపోవటంచేత కళ్ళు ఎర్రగా వున్నాయి.

నన్ను చూడగానే చిన్నగా నిట్టూర్పు వదిలి ఏం జరిగిందని ప్రశ్నించాడు. జరిగిన విషయం చెప్పాను. అంతా విని అన్నాడు హారిపాల్.

"ఇంతకాలం మనం దాగుడుమూతలు ఆపేశాము. తిరిగి ప్రారంభించటంతో మన స్థావరం యిదేనని ఖచ్చితంగా భావిస్తారు. అంచేత ఇక్కణ్ణుంచి తక్షణం ఖాళీ చేయాలి."

వెంటనే ఆ పనిమీద నిమగ్నులయ్యాము.

ఆ లోయలో అసలు ఎవరయినా వున్నట్లు ఆనమాలు కూడా లేకుండా ఖాళీఅయిన ఫుడ్ టిన్స్ మొదలయిన వాటిని లోయలోనే ప్రవహిస్తున్న నీటి వాగులోకి విసిరేశాము.

హరిపాల్ అక్కణ్ణుంచి ఎక్కడికి మకాం మార్చాలో ఆలోచిస్తున్నాడు. అవసరమైన సామాన్లుంచి, మిగిలినవి అన్నీ వాగులోకి విసిరేశాము.

మరో పావుగంట తర్వాత నీటిప్రవాహం వెంబడే నడక సాగించాము. సామానులున్న కిట్స్ మా భుజాల నుంచి వేలాడుతున్నాయి.

హరిపాల్ పరిసరాలు జాగ్రత్తగా గమనిస్తూ నడుస్తున్నాడు.

కొంతదూరం నడిచి నెమ్మదిగా వాగులోకి దిగాము. అక్కడ వాగు లోతు తక్కువ. అక్కడ దాటి అవతలి వైపుకు చేరుకున్నాము.

వాగు దాటి అవతలికి చేరుకొని, చెట్లచాటున కూలబడ్డాం.

"ఇలా ఎంతకాలం?" అన్నాను నేను.

"ఏం? భయంగా వుందా?" నవ్వుతూ అడిగాడు హరిపాల్.

"భయం కాదు. మనం చనిపోయామని మనవాళ్ళు భావిస్తుంటారు. నిజానికి మనంకూడా చచ్చినవాళ్ళ లాగానే బ్రతుకుతున్నాము. కాని నాకిది యిష్టంలేదు. కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలి. ఇలా వీళ్ళని మనం దొంగచాటుగా దెబ్బతీసి అంత మొందించే

కంటె, ఒక్కసారే వాళ్ళ స్థావరాన్ని ధ్వంసంచేసి పారేస్తే మనకు హాయిగా వుంటుంది."

నా మాటలు హరిపాల్‌లో ఆలోచనలు రేకెత్తించాయని అతని ముఖం చూస్తుంటేనే తెలుస్తోంది. అయిదు నిమిషా లనంతరం నావైపు తిరిగి ఏదో చెప్పబోయాడు.

అదే సమయంలో హెలికాప్టర్ శబ్దం విన్పించటంతో ఉలిక్కిపడ్డాము.

4

చీకట్లు కమ్ముకుంటున్నాయి. హోరున గాలి వీస్తూంది. మాకు చాలా దగ్గరలో ఎగురుతూంది హెలికాప్టర్. మేమిద్దరం దట్టమైన చెట్లచాటున, పొదలమాటున వుండటం వల్ల హెలికాప్టర్‌లో నున్నవారికి కన్పించే అవకాశం లేదు. దానికితోడు చీకటి కమ్ముకుంటూంది. మేము ధరించి వున్న బూడిదరంగు, లేతాకు పచ్చరంగు దుస్తులుకూడా మేము దాగటానికి తోడ్పడుతున్నాయి.

ఊపిరి బిగించి హెలికాప్టర్ వంక చూస్తూ కూర్చున్నాము. లోయ అంతా నాలుగైదు మార్లు చుట్టింది. చుట్టుప్రక్కల ప్రదేశాలను కూడా చుట్టి మరో గంట తరవాత వెళ్ళిపోయింది, కాలుతున్న ట్రక్‌ను పరిశీలించి.

"ఇంకా ఈ లోయలో వుంటే పట్టుబడటమో, మరణించటమో ఖాయం" అన్నాడు హరిపాల్, హెలికాప్టర్ వెళ్ళిన దిశవైపు చూస్తూ.

"ఎందువల్ల?"

"మనం దాగటానికి ఈ లోయకంటే మంచి ప్రదేశం మరొకటి లేదని ఊహిస్తారు. అదీగాక మన చర్యలన్నీ ఈ ప్రాంతాల్లోనే నిర్వర్తించాము. అందువల్ల మనం

యిక్కడే వున్నామని సులభంగా గ్రహిస్తారు. ప్రస్తుతం వెంటనే ఈ లోయని విడిచి వెళ్ళిపోవాలి.''

''అయితే ఎక్కడికి వెళదాం?'' అన్నాను నేను.

హరిపాల్ మాట్లాడలేదు. పూర్తిగా చీకట్లు కమ్ముకున్నాయి. మా చేతుల్లో ఉన్న టార్చిలైట్లలో బ్యాటరీలు అయిపోవచ్చాయి కాబోలు, డిమ్‌గా వెలుగుతున్నాయి.

ఈ అడవిలో క్రూరమృగాలు లేకపోయినా, అంతకంటె క్రూరమైన కైనా సైనికులు వున్నారు. మేము జాగ్రత్తగా సంచరించాలి. అడుగడుగునా వలలుపన్ని వున్నారు కైనా సైనికులు. ఏ క్షణంలో ఏమి జరుగుతుందో, ఏ క్షణంలో ప్రాణాలు పోతాయో తెలియదు.

మరోగంట ప్రయాణానంతరం లోయనుదాటి ఈవలకు వచ్చాము. లోయని అధిరోహించి పైకివచ్చాము.

పైభాగం అంతా కొండరాయి. గడ్డి మొలిచి నున్నగా వుంది. కొంతదూరంలో ఎత్తయిన గుట్ట ఒకటి కన్పిస్తూంది. ఇక్కడ నిలబడి చూస్తుంటే, లోయ ఆవలి వైపున మండుతూన్న ట్రక్ కన్పిస్తూంది. మంటలు ఆరిపోవచ్చాయి.

ఆకాశంలో చంద్రుడు ఉదయించాడు. కొద్దిగా వెన్నెల పడుతోంది. పైనున్న మాకు రివ్వున కొండగాలి కొట్టసాగింది. మా చేతుల్లోని బ్యాటరీలైట్లు ఆర్పేశాము. కిట్‌లోనుంచి ఓవర్ కోట్స్ తీసి తొడుక్కున్నాము.

హరిపాల్ గుట్టవంక చూస్తున్నాడు.

ఈ ప్రాంతాలన్నీ హరిపాల్ తిరిగాడు. అన్నీ కొట్టిన పిండి.

''ఈ దాపుల్లో ఊరేమి లేదు. కనీసం అయిదారు మైళ్ళన్నా నడవాలి!'' అన్నాడు హరిపాల్.

"ఉంటే మాత్రమేం? మనకేమి లాభం?"

"ఉంది. మనం ఈ లోయల్లోనే ఎక్కడో ఉన్నామని జైనా సైనికుల విశ్వాసం. మనం ఏదో ఒక గ్రామంలో ప్రవేశించి అక్కడ మకాం పెట్టగలిగితే చాలు. మనం వారి గ్రామంలోనే వుంటున్నామని ఎవరూ భావించరు. ఈ లోపున మన పని పూర్తవుతుంది."

కాని నాకు అతని ఉద్దేశం నచ్చలేదు. "గ్రామాల్లోని ప్రజలు కొత్తవారిని యిట్టే పసికడతారు" అన్నాను.

చిన్నగా నవ్వాడు హరిపాల్. "మనం గ్రామంలో ప్రవేశిస్తామే గాని, ప్రజల కంట పడం!" అన్నాడు.

"అదెలా?" ఆశ్చర్యపోతూ అడిగాను.

"అదంతా తర్వాత. ముందు యిక్కణ్నుంచి పద!"

ఇద్దరం బయలుదేరి, నాలుగయిదు అడుగులు వేశామో, లేదో విమానాల ధ్వని విన్పించి, ఆగిపోయాము. గుట్ట దగ్గరకు పరుగెత్తి బోర్లాగా పడుకుని తలలు తిప్పి చూశాము.

నాలుగయిదు బాంబర్స్ వచ్చి లోయలో బాంబులు వేయటం ప్రారంభించాయి. ధగద్ధగాయమాన వెలుగుతో మండుతూంది లోయ. మేము అక్కడ అనవసరం అని ఉంచిన మందుగుండు సామగ్రి అంటుకొని, లోయ అంతా చప్పుళ్ళతో ప్రతిధ్వనించింది. లోయలోని చెట్లు అంటుకున్నాయి. మంటలలో మాడి మసయిపోతున్నాయి.

మందుగుండు పేలటం గమనించిన విమానం పైలెట్లు ఇంకా ఉత్సాహంతో ఆ ప్రదేశంలోనే బాంబులు విసరసాగారు.

"వెంటనే వెళ్ళాలి! క్విక్!" అరిచాడు హరిపాల్.

ఇద్దరం గుట్టవెనకగా గాలి శక్తికొద్దీ పరుగెత్త సాగాము.

ఆ గుడ్డి వెన్నెల్లో, గుడ్డిగా హారిపాల్ వెనక పరుగెత్తు తున్నాను.

మా వెనకే విమానం చప్పుడు రావటంతో, చప్పున బోర్లా పడిపోయాము. కొండచరియవరకు వచ్చి తిరిగి వెళ్ళిపోయింది విమానం. తిరిగి బయలుదేరి, పరుగెత్త సాగాము.

దాదాపు పావుగంట అనంతరం కొండచరియ అంతమై మరో లోయ ప్రత్యక్షమయింది. లోయ లోపలికి చూసి, నాతోపాటు, హారిపాల్ కూడా నిర్విణ్ణుడయాడు.

లోయ లోపల కాగడాల కాంతి కన్పిస్తోంది. లీలగా గుడారాలు కన్పిస్తున్నాయి. "వీళ్లెవరు? ఇంతకుముందు లేరే?" తనలో తాను అనుకుంటున్నట్లు అన్నాడు హారి పాల్. నాకేమీ అర్థం కాలేదు.

దాదాపు అయిదాగొందల అడుగుల లోతుగల లోయ అది. మేమున్న చోటినుంచి ఏటవాలుగా ఉంది కొండ. మా వెనక బాంబులు పడి, భూమి బద్దలవుతూన్నా యీా గుడారాలలో కదలిక లేదంటే ఏమనుకోవాలి?

నిస్సందేహంగా వీరూ సైనికులే! మమ్మల్ని మట్టుపెట్టటాని కిదో మార్గం. నాలుగువైపులా కమ్ము కొచ్చి, లోయలో ధ్వంసం కాకపోతే నాశనం చేయటాని కిదొక ఎత్తు అయివుండవచ్చు.

ముందు నుయ్యి, వెనక గొయ్యి అన్నట్లయింది మా పరి స్థితి. లోయ అంచులోకి జారి, పాదలమాటున వేలాడ సాగాము. అయిదునిమిషా లనంతరం ఫ్లడ్ లైట్లున్న విమానం ఒకటి ఆ ప్రదేశం అంతా సర్వేచేసి వెళ్ళి

పోయింది. ఇక్కడ బాంబులు వేయరన్న నమ్మకం దృఢ మయింది నాకు.

ఎందుకంటే ఈ లోయలోనివాళ్ళు, వాళ్ళ దేశ సైనికులే కనక!

అదృష్టవశాత్తు ఫ్లడ్ లైటు మామీద పడకుండా తప్పించుకో గలిగాము.

దాదాపు అరగంట తర్వాత అంతా సద్దు మణిగింది. వెనక లోయలో చెట్లు కాలుతున్న చిటపటలు, ఇంకా విన్పిస్తూనే వున్నాయి మాకు.

అలానే లోయలోకి వేలాడుతూ, నిశ్శబ్దంగా ఉండి పోయాము.

5

మరో పావుగంట అనంతరం యిద్దరం అతి కష్టంమీద పైకి చేరుకున్నాము తిరిగి. మేమిద్దరమే అయితే యింత బాధ ఉండదు. మాతోపాటు మా సామానులున్న కిట్స్ కూడా ఉండి, మా వీపున వేలాడుతూంటే, ఏ క్షణాన పట్టు తప్పి లోయలోనికి జారిపోతామేమో అన్పించిన మాట వాస్తవమే!

క్రింద గుడారాలలో సంచలనం ప్రారంభం అయింది. నాలుగయిదు బ్యాటరీలైట్లు వెలిగాయి. తరువాత కొంత సేపటికి దాదాపు పదిమంది వ్యక్తులు బయటకు వచ్చినట్లు కన్పించింది.

"బహుశా ఇదంతా పరిశోధించిగాని వదలరు. మనం వెంటనే వెళ్ళిపోవాలి" నెమ్మదిగా అన్నాడు హరిపాల్.

"బాంబులు వేసి, అంతా నాశనంచేసినా, యింకా అనుమానం పోలేదా వీళ్ళకు?"

"ముందు అనుమానం, తర్వాత వీళ్ళు పుట్టినట్లున్నారు. లేదా, అతి జాగ్రత్త తీసుకుంటున్నారేమో?" నవ్వాడు హరిపాల్.

"అయితే యిప్పుడేమి చేద్దామంటావ్?"

"ప్రస్తుతం మన ప్లాన్ ప్రకారం దగ్గర్లో వున్న గ్రామం చేరుకోవాలంటే, ఈ లోయ దిగి అవతలివైపుకి వెళ్ళాలి. మరో దారి వుంది కాని, మనం విడిచివచ్చిన లోయలోనికి తిరిగి వెళ్ళాలి."

"అంటే ఈ లోయలోనుంచే వెళ్దామంటావా?" అడిగాను, హరిపాల్ ని.

"అవును. మనం ఈ లోయనే దాటి వెళ్ళాలి!" నిశ్చయంగా అన్నాడు హరిపాల్.

ఆ మాటల్లోని అర్థం నాకు తెలుసు. ఆ గుడారాల లోని వ్యక్తులు మరికొద్దిసేపటిలో ప్రాణాలు వదలబోతున్నారన్నమాట. కిట్ తడిమాను. బాంబులు తగిలాయి. హేండ్ గ్రెనేడ్స్.

గుడారాలలోంచి బయటకువచ్చిన సైనికులు నలుగురయిదుగురు ఒక జట్టుగా చీలిపోయి, జట్లు జట్లుగా బయలుదేరారు.

అందరి చేతుల్లోను మెషిన్ గన్స్, బ్యాటరీ లైట్లు ఉన్నాయి.

హరిపాల్ ఏం చేయాలో చకచక చెప్పాడు. ఇద్దరం శబ్దం కాకుండా లోయలోనికి దొర్లాము.

లోయలోనికి పోయే కొండరాయి ఏటవాలుగా వుంది. అక్కడక్కడ ముళ్ళపొదలు, తుప్పలు పెరిగి వున్నాయి. చాలావరకు గడ్డి మొలిచి ఎండిపోయి వుంది. ఇద్దరం శబ్దం కాకుండా జారుతున్నాము నెమ్మదిగా.

బోర్లా పడుకొని ఏదన్నా ఆధారం పట్టుకొని క్రిందకి జారటం, కాలికి ఏదన్నా ఆధారం తగలగానే ఆగిపోవటం చేస్తున్నాము. మొత్తంమీద శరీరం, మోకాళ్ళు, మోచేతులు గీరుకుపోతున్నాయి.

క్రిందనుంచి బయలుదేరిన సైనికుల జట్లు పైకి వస్తున్నాయి చుట్టూ లైట్లు వేసి చూసుకుంటూ. దాదాపు సగం లోయలోకి జారాము.

"రాజూ!" చిన్నగా అరిచాడు హరిపాల్.

చటుక్కున ప్రక్కకి తప్పుకున్నాను. నేను ఉన్నచోట బ్యాటరీలైటు కాంతి వచ్చి పడింది. నా చేయి పట్టు తప్పింది. జర్రున జారాను.

మెషిన్‌గన్స్ ధన్ ధన్ ధన్ మంటున్నాయి.

కొండరాతి పెచ్చులు ఎగిరి పడుతున్నాయి. రివ్వున క్రిందకు దొర్లుతున్నాను. కళ్లు గట్టిగా మూసుకున్నాను. ముళ్ళపొదలు, తుప్పలు గీచుకొని రక్తం వస్తూంది. మంట పుడుతూంది.

ఏదన్నా ఆధారం పట్టుకొని ఆగితే, మెషిన్‌గన్ గుళ్ళకి శరీరంతూట్లు పడటం ఖాయం. ఆగకపోతే రివ్వున జారుతూ, లోయలోనికి దొర్లి 'కైనా' సైనికులముందు పడతాను. మొత్తంమీద నా చావు ఖాయం.

క్రిందనుంచి కాలుస్తున్న గన్ చప్పుడు ఆగిపోయింది.

నేను క్రిందకు రావటం ఖాయం అని కైనా సైనికుల భావన. ఇప్పుడే ఏదన్నా 'మిరకిల్' జరగాలి. దాదాపు క్రిందకు వచ్చేశాను.

క్రింద ఏదో బాంబు పేలిన శబ్దమయింది.

నా చేతికి ఏదో ఆధారం దొరికింది. చటుక్కున పట్టుకొని ఆగిపోయాను.

మరో బాంబు పేలింది. అంతవరకు 'కైనా' సైనికు లున్నచోట చీకటిగా ఉంది. సైనికుల బూట్ల చప్పుడు. మెషిన్‌గన్‌ల ధ్వని.

చేతిని కిట్‌లోనికి పోనిచ్చి, గ్రెనెడ్ తీసి, ఫ్యూజ్ లాగి, శబ్దం వస్తున్న దిక్కున విసిరాను బలంకొద్ది.

పెద్ద శబ్దంతో పేలింది అది. హాహాకారాలు! ఆర్త నాదాలు!!

మరో బాంబు గూడారాలమీద పడి, పేలింది. గూడా రాలు అంటుకున్నాయి. భగభగ మంటల్లో మండు తున్నాయి. మరో బాంబు పడి, మరికొంతమంది సైని కుల్ని మట్టుపెట్టింది.

నామీద దృష్టిని కేంద్రీకరించిన కైనా సైనికులు హరి పాల్‌ని గమనించి ఉండరు.

అరగంట పాటు రణరంగంగా మారిపోయింది ఆ లోయ అంతా.

మరో అరగంట తర్వాత ఆ లోయ దాటి, అవతలివైపు చేరాము నేను, హరిపాల్. దగ్గరోనున్న గ్రామం వైపుకు బయలుదేరాము. ఈ వార్త ఇంకా అందివుండదు 'కైనా' సైన్యాధికారులకు.

అయిదారు మైళ్ళు ఆ మసక వెన్నెల్లో నే నడిచాము. ఆ రోజు ఫలాలుగానీ, తిండిగాని తినకపోవటంవల్ల చాలా ఆకలిగా ఉంది.

దాదాపు పన్నెండున్నర గంటల ప్రాంతంలో గ్రామం పొలిమేరలు సమీపించాము. గ్రామంనిండా సైనికులే కన్పి స్తున్నారు పహరా తిరుగుతూ.

"మనం యిక్కడికి వస్తామని ఊహించి ఉంటారా?" అన్నాను నేను, పరీక్షగా సైనికుల్ని చూస్తూ.

"అయి ఉండదు. ప్రతిరోజు మాదిరే కాపలా కాస్తూ ఉంటారు" అన్నాడు హరిపాల్.

"మనం అక్కడికి వెళ్ళటం చాలా ప్రమాదం. చుట్టు ప్రక్కల మరో గ్రామం లేదా?"

"లేదు. నిజంగానే మనం యిక్కడికి రావటం అనవసరమేమో అనిపిస్తూంది. హెడ్ క్వార్టర్స్‌కి ఒక్కసారే చేరుకుంటే మంచిదేమోనన్పిస్తూంది."

"హెడ్ క్వార్టర్స్ ఎక్కడో నీకు తెలుసా?" ప్రశ్నించాను, మధ్యలో కల్పించుకుని.

"నాకూ సరిగ్గా తెలియదు. అయినా యిక్కడికి దగ్గరే అనుకుంటాను. మూడు నాలుగు మైళ్ళుంటుందేమో?"

"ఈ గ్రామం పేరేమిటి?"

"లీబాండ్ కాబోలు" అన్నాడు హరిపాల్.

"అయితే యిప్పుడేం చేద్దాం?" అగి, ప్రశ్నించాను.

హరిపాల్ మాట్లాడలేదు. గ్రామం వంకే చూస్తున్నాడు.

'లీబాండ్' గ్రామంలో మొత్తం వెయ్యి గడపలుంటాయేమో! గ్రామం మధ్యలోంచి విశాలమయిన రోడ్ వుంది. దానికి అటు యిటూనే వున్నాయి చాలావరకు యిళ్లు. గ్రామానికి ఎడమప్రక్కగా మురికి కాలవ ప్రవహిస్తోంది.

టైం చూసుకున్నాను. ఒకటింబావు అయ్యింది. చంద్రుడికి అడ్డంగా మేఘాలు రావటంవల్ల చీకటిగా ఉంది.

కొంచంసేపుండి హరిపాల్ ఏం చేయాలో చెప్పాడు. తల ఊపి గ్రామంవయిపు బయలుదేరాను.

మురికి కాలవ ఒడ్డమ్మటె నడుస్తున్నాం ఇద్దరం. ఇద్దరం అతి జాగ్రత్తగా అటూ, యిటూ చూస్తూ గ్రామంని సమీపించాము. అదృష్టవశాత్తు చీకటిగానే ఉంది ఇంకా. మమ్మల్ని ఎవరూ గమనించలేదు. ఇద్దరం గ్రామం చివర ఉన్న యింటిని చేరుకున్నాము. ఆ యింటి వెనక పెరడు ఉంది. పెరటి చుట్టూ తక్కువ ఎత్తులో ప్రహరీగోడ ఉంది.

ఇద్దరం చప్పుడు కాకుండా ఎక్కి దూకాము లోనికి. ఎవరూ కన్పించలేదు. చెవులు రిక్కించి విన్నాము. ఏటు వంటి శబ్దమూ లేదు. పెరడు అంతా మురికిగా ఉంది. శుభ్రంచేసి ఎన్నిరోజులయ్యిందో? మొక్కలన్నీ ఎండి పోయి ఉన్నాయి.

ఇద్దరం యింటిలోనికి నడిచాము. తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి కాబోలు, నెట్టగానే తెరుచుకున్నాయి. నెమ్మదిగా లోనికి ప్రవేశించాము.

ఇంట్లో ఎవరూ ఉన్నట్లు లేరు. వీధివైపు ద్వారం తలుపులు మూసి ఉన్నాయి. గడియపెట్టి రమ్మనట్లు సైగ చేశాడు హరిపాల్. నేను నెమ్మదిగా ముందుకు నడుస్తున్నాను.

ప్రక్కగది తలుపులు తెరుచుకొని ఎవరో రావటం, నలిగి, మట్టికొట్టుకుపోయిన మా అవతారాలు చూసి, భయపడి గుండెలవిసేలా కేక లెయ్యటం, మరుక్షణమే వీధి ద్వారంగుండా సైనికులు లోనికి ప్రవేశించటం కన్ను మూసి, తెరిచేంతలో జరిగిపోయాయి చకచక.

ఇంతకాలం తప్పించుకు తిరుగుతున్న మేము, కైనా సైనికులకు చిక్కిపోయాం. మా కళ్ళముందు మృత్యువు జయించినట్లు నవ్వుతోంది.

6

తరవాత చర్యలన్నీ మా ప్రమేయం లేకుండానే చక చక జరిగిపోయాయి.

మా వంక చూస్తున్న 'క్రైనా' సైనికుల కళ్ళకే గనక శక్తి ఉంటే మేము అక్కడే మాడిపోయి ఉండేవాళ్ళం. తమవారిని ఎంతోమందిని నాశనం చేసిన మామీద వారికి అంతులేని కసిగా ఉందని గ్రహించటం మాకు కష్టం గాదు. అసలు ఎంతో ప్రయత్నంమీద మామీద గుళ్ళు కురిపించకుండా నివారించుకోగల్గారని భావించినా తప్పు లేదు.

మమ్మల్ని పట్టుకున్న తర్వాత వారు చేసిన మొదటి పని 'లీబాండ్' గ్రామం అవతల చివరగా ఉన్న ఒక పెద్ద యింటిలోనికి తీసుకువెళ్ళటం. కొండరాతితో, విశాలంగా, చుట్టూ ప్రహరీతో పాతకాలపు కట్టడంలా ఉంది. లోపల సైనికులు గుమ్మం ముందు అటూ ఇటూ తిరుగుతున్నారు.

మాకు ఇంతవరకు ప్రాణాలు నిలవటమే ఆశ్చర్యంగా ఉంది. చిత్రహింసలు తప్పవని తెలుసు. అయినా ఈ పాటికి హరిపాల్ ఏదో ఉపాయం ఆలోచించే వుంటాడు.

తలతిప్పి హరిపాల్ వంక చూశాను. ముఖంలో ఏ భావం లేక నిర్వికారంగా, నిశ్చలంగా ఉన్నాడు హరిపాల్.

మా యిద్దరిని వెంటనే ఎందుకు చంపలేదో తరవాత తెల్సినది.

అదీ ఒక రకంగా అదృష్టమే!

మా దగ్గరున్న వస్తువులన్ని లాక్కున్నారు. మమ్మల్ని నగ్నంగా చేసి ఆయుధా లెటువంటివీ లేవని నిర్ణయించు

కున్నాకగాని వారికి తృప్తికలగలేదు. వారుచేసే ఏ పనికీ ఆటంకపరచలేదు మేము. వారు చెయ్యమన్నట్లల్లా చేశాము.

తరువాత రెండు గంటలు మా జీవితాలలో భయంకర మైన గంటలు. జీవించిగనక ఉంటే వాటిని మర్చిపోలేము. రకరకాల చిత్రహింసలకు గురిచేశారు మమ్మల్ని. మా నోటి మాటకూడా బయటకి రాలేదు. ఒచ్చిందంటే మా పని ఆఖరు అని తెలుసు.

వారికి కావల్సిందల్లా ఒకటే!

"మాతోపాటు ఇంకా ఎందరున్నారు? ఎక్కడున్నారు?"

ఇద్దరం మౌనం వహించాము. మా మౌనం వారిలో కోపాన్ని మరింత రెచ్చగొడుతుందని తెలుసు. అయినా మేము నోరు విప్పలేదు. మా వెనక ఇంకా చాలామంది 'భారత సైనికులు' ఉన్నారని అనుకుంటున్నారు. వాళ్ళ ఉనికి మాద్వారా తెల్సుకోవాలని వాళ్ళ ప్రయత్నం.

రకరకాల చిత్రహింసలు భరించలేక ఇద్దరం స్పృహ కోల్పోయాము.

అలా ఎన్నిగంటలు స్పృహతప్పి ఉన్నామో తెలియదు గాని, స్పృహవచ్చిన వెంటనే మాకు ఆహారం ఇవ్వటంతో మా అవసరం వారికెంత ఉందో అవగతమయింది మాకు.

ఆవురావురుమంటూ తినేశాము. ప్రస్తుతం మా ప్రాణాలకు ఢోకాలేదన్న భరోసా వచ్చింది. కాని మా శరీరాలు పచ్చి పుళ్ళులా తయారయ్యాయి. కదిలితేచాలు ప్రాణం పోతుందేమో నన్నంత బాధగా ఉంది.

మమ్మల్నిద్దర్నీ విడివిడిగా చెరొక సెల్ లో బంధించారు. అందులోకి గాలి, వెలుతురులాంటి వేమీ సరిగ్గారావు.

దోమలుకూడా కాపురముంటున్నాయో, లేక వాటినికూడా బంధించారో తెలియదుగాని మహా యిబ్బంది పెట్టేశాయి.

7

మరుసటిరోజు ఉదయం మమ్మల్నిద్దరిని ఒక ట్రక్ ఎక్కించారు. దానిచుట్టూ టార్పాలిన్ కట్టబడి ఉండటం వల్ల లోపల కటికచీకటిగా వుంది. మా ఇద్దరి కాళ్ళు, చేతులు కట్టి పారేసి, ట్రక్‌లో పడేశారు.

ట్రక్ బయలుదేరింది. ట్రక్ ముందువయిపు ఫ్రంట్ సీట్‌లో నలుగురు సైనికులు కూర్చున్నారు. వారిలో ఒకడు డ్రైవ్ చేస్తున్నాడు. ట్రక్ లోపల మేము, కుదుపులకు అల్లల్లాడుతూ వున్నాము.

నాకు కైనాభాష సరిగ్గా రాదు. హరిపాల్‌కు వచ్చుగాని, అతను స్పృహలో లేడు. బహుశా నాకంటే తెలివయిన వాడుగా కన్పిస్తుండటంవల్ల కాస్త 'డోస్' ఎక్కువయి ఉండవచ్చు.

అస్పష్టంగా విన్పిస్తున్న సైనికులమాటలనుబట్టి మమ్మల్ని హెడ్‌క్వార్టర్స్‌కు తీసుకుపోతున్నారని అర్థం అయింది.

సరిహద్దులో యుద్ధపరిస్థితి ఎలా వుందో తెలియదు. కైనా సైనికులుకూడా తెలియనివ్వటంలేదు.

ట్రక్ కుదుపులకు ఒళ్ళంతా చుట్టుకుపోతూంది. మా ఇద్దరి శరీరాలు రాచుకొంటున్నాయి. మెరుపులాంటి అయిడియా వచ్చింది. వెనక్కు తిరిగి హరిపాల్ కట్లను విప్పదీయటానికి ప్రయత్నించసాగాను.

పావుగంట అనంతరం అతని కట్లు కొద్దిగా లూజు అయ్యాయి. చటుక్కున హరిపాల్ లేచి తన కట్లను ఝాడించి, వదుల్చుకుని, నా కట్లనుకూడా విప్పదీశాడు.

మా శరీరంమీద దుస్తులు కొరడా దెబ్బలకు చిరిగిపోయి వున్నాయి. ఒళ్ళంతా రక్తం, ఎండిపోయి అదోరకమైన వాసన వేస్తూంది.

కొంత సేపటికి ట్రక్ కుదుపులు ఆగిపోయాయి. ఏదో సాఫీ అయిన రోడ్ మీద వెళ్తున్నట్లనిపించింది.

హరిపాల్ నా చెవి దగ్గర నోరుపెట్టి అన్నాడు. "ప్రస్తుతం మనం ఇక్కడే తప్పించుకోవాలి. అందుకే నేను స్పృహలో వున్నా లేనట్లు ప్రవర్తించాను. నన్ను ఒదిలి నువ్వు వెళ్ళవనే వారి నమ్మకం" అన్నాడు.

"ప్రస్తుతం వీళ్ళని ఎలా ఒదుల్చుకోవటం?" అన్నాను నేను.

రెండు నిమిషాలు ఆలోచించి హరిపాల్ నా చెవుల్లో ప్లాన్ చెప్పాడు. అర్థం అయిందన్నట్లు తలాడించి నెమ్మదిగా ట్రక్ వెనక్కి నడిచాను. టార్పాలిన్ తొలిగించి చూశాను. బయట ఎండ కాస్తూంది బాగా. టైం సుమారు పదిన్నర, పదకొండు గంటలవవచ్చు ఉదయం.

బయట ఏదో కొండప్రదేశం. నున్నటి తారురోడ్ మీద పోతూంది ట్రక్. నాకు తెల్సినంతవరకు ఈ దాపుల్లో తారు రోడ్ ఎక్కడా లేదు ఒక్క హెడ్ క్వార్టర్స్‌కి తప్ప. అంటే హెడ్ క్వార్టర్స్‌ని సమీపించబోతున్నాము. ఈ మాట తెల్చుకోగానే ఒళ్ళు జలదరించింది. ఇంతవరకు జరిగింది ఒక ఎత్తు, ఇకముందు జరగబోయేది మరొక ఎత్తు.

ట్రక్ అడుగు అంచు పట్టుకొని, బయటకు జారాను. లోపలనుంచి హరిపాల్ పెద్దగా కేక వేయటం విన్పించింది. మరుక్షణమే ట్రక్ ఆగటం, నేను చటుక్కున దిగి ట్రక్ క్రిందకు దూరటం జరిగింది. ట్రక్‌కు అటూ, ఇటూ సైనికులు దిగటం కన్పించింది.

ఊపిరి బిగపట్టి సైనికుల కాళ్ళవంకే చూస్తున్నాను. ఆ ఇద్దరు ట్రక్ వెనక్కు నడిచి టార్పాలిన్ ఎత్తి లోనికి పోయారు. నేను అడుగునుండే ముందువైపుకు దొర్లి డ్రైవింగ్ సీట్ వద్ద లేచాను. ట్రక్ వెనుకభాగానికి, ముందు భాగానికి మధ్య వున్న తలుపుద్వారా చూస్తున్నారు మిగిలిన ఇద్దరు.

స్టడీగా నిలబడి, అతని భుజం తట్టి పిలిచాను. నా వంక తిరిగి చూసి అదిరిపోయాడు. ఫట్‌మంది అతనిముఖం. పచ్చబడిపోయి వుంటుంది. రెండోవాడు తేరుకోకముందే అతని ముఖంమీదకూడా మరో గుద్దుగుద్దాను. ముక్కువెంట రక్తం వచ్చింది. బిర్లుకమ్మి కూలిపోయాడు. డ్రైవింగ్ సీట్‌లో వున్నవాణ్ణి క్రిందకులాగి డొక్కలో తన్నాను. అప్పుడే రెండోవాడు తేరుకున్నాడు. క్రిందపడ్డవాడి దగ్గిరి మెషిన్ గన్ లాక్కుని ట్రిగ్గర్ నొక్కాను.

విరుచుకు పడిపోయాడు వాడు. రక్తం జివ్వునచిమ్మింది. లోనున్న ఇద్దరు హడావుడిగా బయటకు వచ్చారు. అంతే! వాళ్ళూ, నా మెషిన్‌గన్ గుళ్ళకు బలయిపోయారు. క్రింద పడ్డవాడు లేవబోతున్నాడు. వాణ్ని మట్టుపెట్టేశాను.

హరిపాల్ మూలుగుతూ దిగివచ్చాడు. సైనికుల గన్స్ చెరొకటి తీసుకొని, మిగిలిన రెండూ ప్రక్కనే ఉన్న తుప్పల్లో పారేశాము, సైనికులతో సహా.

ఇద్దరం ఫ్రంట్ సీట్‌లో కూర్చున్నాము. ట్రక్‌ని ముందుకు పోనిచ్చాను. హరిపాల్ పరిసరాలను గుర్తుకు తెచ్చుకుంటున్నాడు. హఠాత్తుగా అపమన్నాడు.

"మనం హెడ్‌క్వార్టర్స్‌కి దగ్గర్లోనే వున్నాము. ఈ ట్రక్ అవసరం ఇక వుండకపోవచ్చు!" అన్నాడు.

ఇద్దరం దిగి ట్రక్ ని ప్రక్కనే వున్న లోయలోనికి నెట్టేశాము. కొంత దూరంలో కొండలు కన్పిస్తున్నాయి. కొండలు అనేకంటే పెద్ద పెద్ద గుట్టలు అనటం సమంజసం.

"ఆ గుట్టలు ఎక్కి చూస్తే హెడ్ క్వార్టర్స్ కన్పిస్తాయి" అన్నాడు హరిపాల్.

రెండు గంటల ప్రాంతంలో ఇద్దరం కొండ ఎక్కటం ప్రారంభించాము. సరియైన దారిలేదు. పైగా ఎండ. ఎలా గయితేనేం శ్రమపడి కొండ ఎక్కగలిగాము. గుట్టలాగా వున్న ఆ కొండ రెండో చివర నున్నగా, నిట్టనిలువుగా వుంది. ఆ అంచుద్వారా ఎక్కటంగాని, దిగటంకాని వీలు కాదు. ఈ గుట్టేకాదు. అక్కడ వున్న గుట్టల్లాంటి కొండ లన్నీ లోపలవైపుకు అలానే వున్నాయి. అది విచిత్రం అన్పించింది గాని, అసలు విషయం తెలిసిన తర్వాత ఇదంతా చైనా సైనికుల పనేనన్పించింది.

ఇద్దరం బోర్లాగ పడుకొని ముందుకు చూశాం.

"ఆ కన్పించే భవనాలే హెడ్ క్వార్టర్స్" అన్నాడు హరిపాల్.

8

చుట్టూ కొండలు. కొండల మధ్యలో విశాలమయిన మైదానం. ఆ మైదానం మధ్యలో వున్నాయి సైనికుల భవనాలు. మొత్తం మూడు. మాకు ఎడమవేపునుంచి రోడ్ వుంది. ఆ రోడ్ కొండల మధ్యలోనుంచి వేశారు లోనికి.

రోడ్ కి ఎదురుగా ఒక భవనం. దానికి అటూ యిటూ కొద్ది దూరంలో అడ్డంగా మరో రెండు భవనాలు ఎదురుబొదురుగా వున్నాయి.

ఆ భవనాలు చాలక తాబోలు భవనాల వెనక సైనికుల గుడారాలు కన్పిస్తున్నాయి. సరిహద్దుల్లో పోరాడుతున్న

'కైనా' సైనికులకు యిక్కణ్నుంచీ సప్లయిలు జరుగుతుం టాయి. ఇక్కణ్నుంచి సరిహద్దు ఏడెనిమిది మైళ్ళుంటుంది. కైనా సైనికులు క్రమంగా ముందుకు చొచ్చుకుపోవటంతో వారికి హెడ్ క్వార్టర్స్ దూరం అయ్యాయి.

దీనిని నాశనం చేయడంవల్ల పెద్ద లాభమేమి కన్పించ లేదు నాకు. ఇది కాకపోతే, మరొకటి వెలుస్తుంది. ఏం చేద్దామని ప్రశ్నించాను హరిపాల్ ని.

'మనం ఇంత కష్టపడి ఇక్కడకు చేరుకుంది దీనిని నాశనం చేయటంకోసమే. కనుక దాన్లో సందేహం లేదు. కాని ఎలా?'' అన్నాడు హరిపాల్.

''అది నిజమే! కాని దీనిని నాశనం చేయటంవల్ల మనకు పెద్ద లాభం లేదుకదా?'' అంటూ, నా మనసులో వున్న సందేహాన్ని బయటపెట్టాను.

''లాభం ఎందుకు లేదూ? కైనా కమాండర్-ఇన్-ఛీఫ్ నుంచి వచ్చే వార్తలు ఈ ఏరియాకి ఇక్కణ్నుంచే ప్రసార మవుతాయి. అంతేకాదు ఇక్కణ్నుంచే సైనికులకు ఆహార పదార్థాలు, మందుగుండు సామాగ్రి మొదలైనవి సప్లయి అవుతాయి. ఒక రకంగా ఇది ఆ ఏరియాలోని కైనా సైని కులకు, రాజధానిలోని సైనికాధికారులకు అనుసంధానకారి వంటిది. మన మిప్పుడు దీన్ని కూల్చెయ్యటంద్వారా సమ యానికి సప్లయిలు అందక సరిహద్దుల్లోని కైనా సైనికులు ఇబ్బంది పడతారు. తద్వార మనవాళ్ళకి కొంత వెసులు బాటు లభిస్తుంది.'' ముగించాడు హరిపాల్.

ఇంతలో మాకు ఎడమప్రక్క వున్న తారురోడ్ పైన ట్రక్ శబ్దాలు విన్పించటంతో మాటలు ఆపేసి తలలుతిప్పి చూశాము.

కొండలవద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను దాటి అయి దారు మిలటరీ ట్రక్కులు మైదానంలోనికి ప్రవేశించాయి. మాకు, సైనికభవనాలకు మధ్య చాలా దూరం ఉంది. అంతేకాదు, మేము కొండపైనుండి, పడుకొని వుండటం వల్ల మమ్మల్ని ట్రక్‌లోవున్న వాళ్ళు గమనించే అవకాశం లేదు.

మైదానంలోకి ప్రవేశించిన ట్రక్కులు లోపలికి వేసిన తారురోడ్ ద్వారా భవనాలవైపు సాగాయి. వాటినిండా, చుట్టూ టార్పాలిన్లు కప్పబడి వున్నాయి. వాటి నడక చూస్తుంటే ఫుల్ లోడ్‌లో వున్నట్లున్నాయి.

మరో అయిదు నిమిషాల తర్వాత ట్రక్‌లు భవనం ముందాగాయి. ఫ్రంట్ సీట్లలోనుండి నలుగురయిదుగురు సైనికులు దిగారు. ప్రతి ఒక్కరి చేతిలోను తుపాకులున్నాయి. వారుతప్ప ట్రక్స్‌నుంచి ఇంకెవరూ దిగలేదు.

"ఇక్కణ్నుంచి చూస్తే లాభంలేదు. అక్కడికి వెళ్ళి చూడాలి." అన్నాడు హరిపాల్.

"ఇప్పుడా?" ఆశ్చర్యపోయి, అడిగాను. "ఇంత పట్ట పగలా?"

హరిపాల్ నవ్వాడు. "మనం ఇప్పుడు బయలుదేరితే గాని, రాత్రికి అక్కడికి చేరుకోలేము. ఇక్కడ కాపలా బాగా వుంటుంది. ఇక్కడకువచ్చే ఏ ట్రక్ అయినా వస్తున్నట్లు ముందే తెలుస్తుంది. అందుకే మన ట్రక్‌ని లోయలోనికి తోయించేశాను. ప్రస్తుతం నడకే మనకు గతి" అని అన్నాడు హరిపాల్.

"ఆ దారితప్ప మరో దారి ఏమీ లేదా?"

"తారు రోడ్డు తప్ప మరోదారికూడా లేదు. అదే మనకు శరణ్యం."

ఇద్దరం నెమ్మదిగా కొండ దిగసాగాము, ఎండకు శరీరం నిండా చెమటలు కారుతున్నాయి, మెషిన్ గన్స్‌ని చేతులు మార్చుకుంటూ మోస్తున్నాము.

"ప్రస్తుతం బోర్డర్స్‌లో ఎలా వుందో?" అన్నాను దిగాలుగా.

"నా ఊహే నిజమయితే యిప్పుడు వార్ జరక్కపోవచ్చు" అన్నాడు హరిపాల్.

"ఎందుకనుకుంటున్నావలా?" అన్నాను.

"నిన్నటిరోజున చిత్రహింసలు పెట్టినపుడు నాకు నిజంగా స్పృహపోలేదు, అయినా తప్పిపోయినట్లు నటించాను. అప్పుడు కైనా సైనికులు మాట్లాడుకుంటున్న మాటలు నా చెవినబడ్డాయి. ప్రస్తుతం సరిహద్దుల్లో ప్రశాంతంగావుందని, కైనా రాజకీయ నాయకులుఏదో కొత్తప్లాను వేస్తున్నారని తెలిసింది. కాని ఆ ప్లాన్ ఏమిటో మాత్రం తెలియలేదు. మన ఉనికి వాళ్ళని విపరీతంగా భయపెడుతోంది. వాళ్ళ ప్లానుని భగ్నంచేస్తామేమోనని విపరీతంగా భయపడుతున్నారు. అందుకే ఆ ప్లాన్ అమలుజరుపబోయే ముందు మనల్ని పూర్తిగా నాశనం చేసిగాని వదలదల్చుకోలేదు వాళ్ళు. కాని మనం అక్కడ నోరు విప్పకపోవటంతో మనల్ని హెడ్‌క్వార్టర్స్‌కి పంపదల్చుకున్నారు."

"అంటె మనం వస్తున్నట్లు హెడ్ క్వార్టర్స్‌కి తెలుసా?"

"తెలుసు. ఎప్పటికప్పుడు వైర్‌లెస్ ద్వారా మెస్సేజ్ అందుతుంది వాళ్ళకి."

ఇద్దరం కొండదిగాము. తారురోడ్ ప్రక్కన చెట్ల చాటున నడవసాగాము. మా బూట్లక్రింద ఎండుటాకులు పడి శబ్దంకాకుండా జాగ్రత్తపడుతున్నాం.

"ఇక్కణ్నుంచి సుమారు మైలుదూరం పోవాలి. అక్కడ ఈ రోడ్ వంపు తిరిగి కొండల్లోనుండి మైదానం లోకి దారితీస్తుంది."

ఇద్దరం మౌనంగా నడక సాగించాము. దార్లో కన్పించిన చెట్ల ఫలాలను తిని ఆకలి తీర్చుకున్నాం.మరోగంటా, గంటన్నర తర్వాత రోడ్ వంపులోనికి ప్రవేశించి ఆగిపోయాం. ఫర్లాంగు దూరంలో చెక్ పోస్టు వుంది.

"చీకటి పడితేగాని లోనికి చేరుకునే మార్గం ఆలోచించలేము." అంటూ రోడ్ ప్రక్కనేవున్న చెట్ల తోపులోకి దారితీశాడు హారిపాల్. నేనూ అనుసరించాను.

ఇద్దరం చీకటిగానున్న చోటు చూసుకొని కూలబడ్డాం. తర్వాత కొంచెంసేపటికి లోపలినుంచి ట్రక్ లు వస్తున్న శబ్దం అయింది. ఇద్దరం లేచి చూశాం. ఖాళీ అయిన ట్రక్కులు వరసగా వెళ్ళిపోతున్నాయి.

"ఇందాకటివి ఖాళీ అయినట్లున్నాయి" అన్నాడు హారిపాల్. ఇద్దరం వెనక్కి తిరిగివచ్చాం.

9

రాత్రి పదిగంటలు అయివుండవచ్చు. పుచ్చపువ్వులా వెన్నెల కాస్తోంది. ఆ వెన్నెలలో పరిసరాలన్నీ వెండితో కడిగినట్లు మిలమిలా మెరిసిపోతున్నాయి. గాలి స్తంభించి వుంది. కీచురాళ్ళ రొదలు తప్ప ఇతర శబ్దమేమీ లేదు.

తలెత్తి ఆకాశం వంక చూశాను. పీసమెత్తు మేఘం కూడా లేదు. ఈ వెన్నెల్లో గనక మేము బయటికి వస్తే, సెంట్రీలకు కన్పించడం ఖాయం. స్పష్టంగా కన్పించకపోయినా, మా ఉనికి తెల్సిపోతుంది. పైగా, మా గురించి యిప్పటికే హెడ్ క్వార్టర్స్ కి వార్త చేరి వుంటుంది. మేము యింకా చేరకపోవటంవల్ల కంగారుపడి వుంటారు.

నిముషాలు గడిచిపోతున్నాయి. ఓపిగ్గా కూర్చున్నాము యిద్దరం. దాదాపు పదిన్నర గంటల ప్రాంతాల్లో తిరిగి వచ్చాయి ట్రక్కులు. లోడ్ మీద వున్నాయి. చెక్ పోస్టు వద్ద వరసగా ఆగిపోయాయి. గేటుదగ్గర వున్న సెంట్రీ ఒక్కొక్క ట్రక్కునే చెక్ చేసి లోనికి వదులుతున్నాడు.

మాకు అయిదారొందల గజాల దూరంలో వుంది చివరి ట్రక్కు. లోపలనుంచి గార్డుగాని, డ్రైవర్ గాని దిగ లేదు. చెక్ పోస్టువద్ద సెంట్రీలు అక్కడ వున్న ట్రక్కుని పరీక్షించడంలో మునిగిపోయి వున్నారు. మమ్మల్ని గమ నించే అవకాశం లేదు. మెమ్మదిగా బయటకువచ్చి, చివరి ట్రక్ వెనక భాగానికి చేరుకున్నాను. నా వెనకే హారిపాల్ వచ్చాడు.

నేను ముందుకి పోయాను. చివరి ట్రక్ కి, దాని ముందు ట్రక్కుకి మధ్య ఎక్కువ దూరంలేదు. చటుక్కున ఆ దూరం పాకి, రెండో ట్రక్కు అడుగుభాగం చేరుకున్నాను. హారిపాల్ చివరిట్రక్కు అడుగున వేలాడుతున్నాడు.

పావుగంట తరువాత ట్రక్కులు బయలుదేరాయి.

నిరాటంకంగా శత్రు శిబిరంలోకి జొరబడ్డాము నేను, హారిపాల్. మైదానంలోనికి ప్రవేశించిన ట్రక్కులు రివ్వున రోడ్ మీదుగా దూసుకుపోయాయి. ట్రక్ అడుగునుండి జారి క్రింద పడిపోకుండా, బలంగా పట్టుకొని జాగ్రత్త పడ్డాను.

అయిదునిమిషా లనంతరం భవనాలదగ్గర ఆగిపోయాయి ట్రక్కులు. ఎదురుగానున్న భవనానికి ఒకప్రక్కనుంచి, సైనికులందరూ దిగి వెళ్ళిపోయారు భవనంలోకి.

మరో అయిదు నిమిషాలు గడిచిపోయాయి. ఎవరూ

వస్తున్న జాడలేదు. నెమ్మదిగా క్రిందకు జారి, నేలమీద వెల్లకిలా పడుకున్నాను. అరచేతుల నిండా చెమట పట్టి, నొప్పిగా వున్నాయి. మరోనిముషం అలానే ఉండి పోయాను. వెన్నెల్లో ఎడమ, కుడివైపు వున్న భవనాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

దూరానికి చూస్తే బాగానే వున్నా, అవి చాలా పాతకాలం నాటివని దగ్గరనుంచే చూస్తే తెలిసిపోతూంది. బాగా శిథిలమయిపోయాయి. వాటిని బాగుచేయించి ఈ విధంగా ఉపయోగించుకుంటున్నారు. లోపల కొన్ని గదుల్లో పెట్రోమాక్స్ లైట్లు వెలుగుతున్నాయి. కొన్ని గదుల్లో అసలు దీపాలే లేవు.

ఏదో అలికిడి కావటంతో ఆలోచనలనుండి బయటపడి, చటుక్కున తల తిప్పాను.

హారిపాల్!

నేనున్న ట్రక్ క్రిందకు పాకుకుంటూ వస్తున్నాడు. మరో పదినిముషాలు ఇద్దరం మౌనంగా వేచివున్నాము. డ్రైవర్ల జాడ లేదు. ఇక ఈ ట్రక్కులు ఇప్పుడప్పుడే కదిలేలా లేవు. వీటిద్వారానే మేము యిక్కణ్నుంచి బయటపడాలి.

అక్కడ వున్న మూడు భవనాల ముందు తుపాకులు ధరించివున్న సెంట్రీలు అటూ, ఇటూ తిరుగుతూ కాపలా కాస్తున్నారు. భవనాల లోపల ఏ అలికిడీ లేదు. అందరూ నిద్రపోతున్నట్లున్నారు.

ఏమిచేయాలో యిద్దరం అంతకుముందే నిర్ణయించుకున్నాం గాబట్టి, అక్కడ పరిస్థితులు చూసి తికమక పడలేదు. హారిపాల్ అంచనాలన్ని కరెక్టుగానే వేశాడు.

కానీ ఈ వెన్నెలొకటి! మేము బయటపడితే మమ్మల్ని గమనించే అవకాశం సెంట్రీలకు ఉంది. అందుచేత తొందర పడకుండా సావధానంగా ముగించాలి పనిని.

చటుక్కున నాకొక అయిడియా వచ్చింది.

నాకు తోచిన ఉపాయం హారిపాల్‌తో చెప్పాను. అతనూ కొంచెం ఆలోచించి, అంగీకరించాడు.

10

నెమ్మదిగా నేను ట్రక్ క్రిందనుండి బయటికి దొర్లాను. సెంట్రీలు నన్ను గమనించటం లేదని నిర్ధారించుకొని, చటుక్కున లేచి నిలబడ్డాను. వారివైపు నడవసాగాను.

నా అడుగుల చప్పుడు విని తిరుగుతున్న యిద్దరు సెంట్రీలు చటుక్కున ఆగిపోయారు. తుపాకులు నా వైపుకు గురిచేశారు.

"ఎవరది?" కైనా భాషలో అరిచాడొకడు.

సమాధానం యివ్వకుండా అలాగే ముందుకి నడిచాను. సేఫ్టీ కాచ్ క్లిక్‌మన్న శబ్దం అయి, ఆగిపోయాను.

నాకూ, వారికి మధ్య నాలుగయిదడుగుల దూరం కంటే ఎక్కువ వుండదు. నా నుంచి సమాధానం రాక పోవటంతో వారిలో అనుమానం పెరిగినట్లుంది, నా ముఖం మీద బ్యాటరీలైటు కాంతి పడింది.

తర్వాత జరగబోయేది నాకు తెలుసు. నా దగ్గరవున్న మెషిన్‌గన్‌ని క్రిందకి వదలటం, ఊపిరి ఓగించి వారిద్దరి మీదకు లంఘించటం ఏకకాలంలో జరిగిపోయాయి.

ఒకణ్ని కాలితో గొంతుమీద తన్ని, రెండోవాడి పీక పట్టుకున్నాను. అదే క్షణంలో హారిపాల్ కూడా పరుగెత్తు కుంటూ వచ్చాడు. క్రింద అంతా దుమ్ముతో నిండివుండటం వల్ల బూట్లశబ్దం కాలేదు.

మరో రెండు నిమిషాలలో స్పృహతప్పిన ఆ సెంట్రీల నిద్దరినీ ట్రక్కుల క్రింద పడేశాము. అక్కడే ఆగి పరిశీలించాము. దూరంగా వున్న భవనాలముందు తిరుగుతున్న సెంట్రీలు మమ్మల్ని గమనించలేదు.

ఇద్దరం భవనం సింహద్వారంవైపు నడిచాము. ఆ భవనాలన్నీ ఒకే మోడల్ లో కట్టబడ్డాయి. రెండంతస్థులున్నాయి ప్రతిదానికి. సింహద్వారంవద్ద ఎత్తుగా మెట్లు వున్నాయి. వాటిద్వారా లోనికి ప్రవేశించాము. తలుపులు దగ్గరగా వేసివున్నాయి. తలుపు సందుల్లోంచి లోనుండి పెట్రోమాక్సు లైట్ల కాంతి బయటకు వస్తోంది.

తలుపు సందుల్లోంచి చూశాను. లోపల విశాలమైన హాలు. హాలుకి మూడువైపులా గదులున్నాయి. హాలులో క్రింద వరసగా సైనికులు నిద్రపోతూ కన్పించారు. హాలుకి అవతల చివర పైకి పోయేందుకు మెట్లు కన్పించాయి.

ఇద్దరం తిరిగి సింహద్వారం దగ్గరికి నడిచాము. అక్కడ వున్న స్తంభం ప్రక్కనే నక్కాము.

"మధ్యాహ్నం వచ్చిన ట్రక్కులు ఏవో లోడ్స్ దించి వెళ్ళాయి. అవి ఏమయినట్లు? అసలవి ఏమిటి?" అని అడిగాడు హారిపాల్.

"మిగిలిన రెండు భవనాలలో దాచారేమో! అది సరే! ఇక్కడేమిటి యింతమంది సైనికులు?" ఆత్రంగా అడిగాను.

"బహుశా సరిహద్దులకి వీరిని తరలిస్తున్నారేమో. వీళ్ళకి కావల్సిన సప్లయిలు అయివుంటాయి ఆ లోడ్స్!"

"మనం మిగతా భవనాలని కూడా పరీక్షిస్తే బాగుంటుందేమో!"

నా అభిప్రాయం బయటపెట్టాను. హరిపాల్ కూడా అంగీకరించాడు. ఇద్దరం నెమ్మదిగా బయటపడ్డాము. ఎడమ వైపు భవనాన్ని సోదా చేశాముగాని, అనుమానించదగ్గదేది దొరకలేదు. దాని నిండా కూడా సైనికు లున్నారు.

"పైకి వెళ్ళటానికి వీలులేదు. ముందు కుడివైపు దాన్ని కూడా చూసి వద్దాం రా!" అన్నాడు హరిపాల్.

మొదటి మాదిరిగానే బయట నున్న సెంట్రీలను తప్పించామని వేరే చెప్పనక్కరలేదు.

మూడో భవనం తలుపు తెరిచి, లోనికి అడుగెట్టి నిర్ఘాంతపోయాము. అదే సమయంలో బయట కలకలం అయింది. సైనికుల కేకలు, చప్పుళ్ళు.

అప్పుడు గుర్తొచ్చింది మేము చేసిన పొరపాటు. చంపకుండా, వదిలిన సెంట్రీలకు ఎవరికో స్పృహ వచ్చి ఉంటుంది.

చటుక్కున తలుపులు మూశాడు హరిపాల్. లోపల ఉన్న ఇద్దరు సెంట్రీలు నిద్ర మేలుకున్నారు. కాని కాపలా కాయాల్సినవాళ్ళు నిద్రపోవటం ఫలితంగా ఇద్దరూ కూలిపోయారు.

ఇద్దరం లోపల కనిపిస్తున్న డైనమైట్స్, మొదలయిన ఎక్స్‌ప్లోజివ్స్ మీదకు దూకాము.

విశాలమయిన ఆ హాలులో రెండో చివర పెద్ద పెద్ద చెక్కపెట్టె లున్నాయి. వాటిల్లో ఏముంటాయో తెలుసు.

ఎక్స్‌ప్లోజివ్స్!

హేండ్ గ్రెనేడ్స్ మొదలుకొని టైంబాంబు వరకు ఉండి ఉంటాయి. రకరకాలయిన బాంబులు. నాటువి, మోటువి, అధునాతనమయినవి, ఎన్నో రకాలు. చెక్క పెట్టెలు క్రిందికి దించి సీలు విప్పదీస్తున్నాడు హరిపాల్.

బయటనుంచి కేకలు, చప్పుళ్ళు, గోల ఎక్కువయి పోయింది. తలుపులు బాదుతున్నారు. ఏ క్షణంలో అయినా విరిగి పడవచ్చు. అదృష్టవశాత్తు మేడ పై భాగంలో ఎవరూ ఉన్నట్లు లేరు.

వరసగా నాలుగయిదు చెక్కపెట్టెలు విప్పదీశాడు హారిపాల్. మెషిన్ గన్ మాగజైన్ లోడ్ చేశాను.

ఇద్దరం బోర్లాగా పడిపోయాము. బయటనుంచి కాల్పులు ఆరంభమయ్యాయి. తలుపులమీదకు పేలుస్తున్నారు.

హారిపాల్ చేతిలోనికి బాంబ్ తీసుకుని, నా వంక చూశాడు. ప్రోత్సహిస్తున్నట్లు తల ఊపాను. చాలా ప్రమాదకరమయిన చర్య అది. ఆ బాంబు తాకిడికి ఆ గదిలోని ఇతర ఎక్స్ప్లోజివ్స్ అంటుకున్నాయంటే మా పని గోవింద.

పంటితో ప్యూజ్ లాగి తలుపుమీదకు విసిరేశాడు. వెంటనే బోర్లాపడిపోయి, తల నేలమీదకు ఉంచి, చెవులు గట్టిగా మూసుకున్నాము.

భయంకరమయిన శబ్దంతో పేలింది బాంబు. తలుపులు ఎగిరిపడ్డాయి. రాళ్ళు, రప్పలు మామీద పడ్డాయి, చటుక్కున లేచాము. ద్వారంవద్ద పొగ, కళ్ళు కన్పించనంత పొగ.

బయట ఉన్న సైనికులలో కొందరు చనిపోయి ఉంటారు. మిగిలినవాళ్ళు దూరంగా పోయి ఉంటారు.

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

మరో బాంబు విసిరేశాను. ఆర్తనాదాలు, కేకలు!

ఆ కన్పించని పొగలోనే పోయి మెషిన్ గన్ ట్రిగ్గర్ నొక్కాను, చుట్టు తిప్పుతూ. ధన్ ధన్ ధన్ మంటూ పేలుతూంది మెషిన్ గన్.

దూరంగా వున్న కొంతమంది కైనా సైనికుల ఆర్త నాదాలు.

బహుశా వారి అమ్యూనిషన్ అంతా ఇక్కడే వున్నట్లుంది. అందుకే మమ్మల్ని ఏమీ చేయలేకపోతున్నారు.

హరిపాల్ అయిదారు బాంబుల్ని ఫ్యూజ్ లాగి, చుట్టూ మైదానంలోకి, బిల్డింగులమీదికి బలంకొద్ది విసిరేశాడు.

చెవులు చిల్లులుపడుతున్నాయి. సైనికుల కేకలు.

మాలో పైశాచికత్వం ప్రబలింది. ఏదో తెలియని కసి! ఆనందం!!

నేనూ చేతికందినన్ని బాంబుల్ని విసిరేస్తున్నాను.

వెనక కిటికీవైపు అలికిడయింది. గన్ అటు తిప్పి ట్రిగ్గర్ నొక్కాను. కీచుగా అరిచారెవరో. మరుక్షణం కిటికీ దగ్గరకు పరుగెత్తి బాంబు విసిరాడు హరిపాల్. భవనం వెనుక పొంచి వస్తున్న సైనికులు తుత్తినియలయి ఎగిరిపడ్డారు. మరో బాంబుకి గుడారాలు అంటుకున్నాయి.

హరిపాల్ ఆ కేకలు, చప్పుళ్ళమధ్య బాంబులు విసురుతూనే పెద్దగా అరిచి చెబుతున్నాడు. నేను మెషిన్ గన్ కు పని చెబుతూనే వింటున్నాను.

గుమ్మం చాటున నిలబడి కాలుస్తున్నాను. మా ధోరణి గ్రహించారు కైనా సైనికులు. వాళ్ళూ తెగించారు. ఆ బాంబుల మధ్యలో చచ్చినవాళ్ళు చావగా, మిగిలినవాళ్ళు ముందుకి చొచ్చుకువస్తూ కాల్పులు సాగిస్తున్నారు.

గుమ్మం చాటునుండి హఠాత్తుగా వచ్చి, గన్ కాల్చి, ప్రక్కకు తప్పుకోవడం నేను చేస్తున్న పని.

బాంబుల శబ్దంతో మైదానం అంతా ప్రతిధ్వనిస్తోంది.

ఏ క్షణంలో అయినా మేమున్న ఆ శిథిలభవనం కూలిపోయే టట్లుంది.

మెషిన్ గన్ కాల్చాను. భుజం చురుక్కుమంది. వెంటనే తొడల్లో మంట. పిక్కలు పేలిపోతున్నాయి. చటుక్కున పక్కకు తప్పుకున్నాను,

హరిపాల్ బాంబు విసిరాడు. నా వంక చూశాడు. బలహీనంగా నవ్వాను. భుజంనుంచి, తొడల్లోంచి రక్తం విపరీతంగా కారుతోంది.

హరిపాల్ చెక్కపెట్టెల దగ్గరికి నడిచి, చేతికి పట్టి నన్ని బాంబులు తీసుకున్నాడు. జేబుల్లోను, షర్టు లోపల పట్టినన్ని వేసుకున్నాడు. నేను గుమ్మం దగ్గరే వున్నాను. చేయి ఊపాను.

గన్ బయటకు గురిచూసి కాల్చాను. రెండు బాంబులు విసిరాడు హరిపాల్. మరుక్షణం ఆ పొగలో అదృశ్య మయ్యాడు.

నాకు క్రమంగా నిస్సత్తువ ఆవహిస్తోంది. కళ్ళు మూతలు పడుతున్నాయి.

బయట భవనాలమీద బాంబులు విసురుతూంటాడు హరిపాల్. ప్రేలుళ్ళు భయంకరంగా వినిపిస్తున్నాయి. నా దగ్గరున్న అమ్యూనిషన్ అయిపోయింది. లేచే ఓపిక లేదు.

అయినా ఓపిక చేసుకొని లేచాను. అలానే పాక్కుంటూ హాలు చివర వున్న అమ్యూనిషన్ లోడ్ దగ్గరకు నడిచాను.

అయిదు నిమిషాలపాటు కష్టపడి నే ననుకున్నది చేశాను. మరలా పాక్కుంటూ గుమ్మం దగ్గరికి వెళ్ళాను.

మెషిన్ గన్ ని కాళ్ళదగ్గరగా వుంచుకున్నాను. గోడకి చేరగిలబడి కూర్చున్నాను. నేను చనిపోతానని తెలుసు. అయినా యెందుకో చావంటే భయం కలగటంలేదు. నిశ్చయంగా చస్తామని తెల్సినపుడు కలిగే వైరాగ్యం కాబోలు యిది!

బయట ఇంకా చప్పుళ్ళు విన్పిస్తూనే వున్నాయి. గన్ లాక్కుని కాళ్ళమీద వేసుకున్నాను.

మరో అయిదునిమిషాల తర్వాత బయట కాల్పులు ఆగిపోయాయి. అంటే హరిపాల్ ...!

గుండెల్లో కలుక్కుమంది. నిస్త్రాణతో కళ్ళు మూసుకున్నాను. అలా ఎంతసేపు వున్నానో తెలియదు. కలకలం వినిపించింది. నెమ్మదిగా, అతి కష్టంమీద కళ్ళు తెరిచి చూశాను. మసకమసగ్గా వుంది. లీలగా మనుష్యుల ఆకారాలు గోచరిస్తున్నాయి.

నా మీదకు వంగి చూస్తున్నారెవరో. కాని నా కళ్ళకు వాళ్ళు కన్పించడం లేదు. ఎదురుగా అమర్చిన డైనమైట్లు, బాంబులు కన్పిస్తున్నాయి. నా చేతిలోని మెషిన్ గన్ వాటికి సరిగ్గా గురి పెట్టబడివుంది.

ట్రిగ్గర్ నొక్కితే ఏమవుతుందో తెలుసు. ఆ సావరం క్షణాల్లో స్మశానంగా మారుతుంది. ఆ హాలులో చాలా మంది ఉన్నట్లున్నారు. తృప్తిగా ఊపిరి పీల్చి, ట్రిగ్గర్ నొక్కాను.

తర్వాతేమయిందో ఇహ నాకు తెలియదు.

—: ఐ పో యిం ది :—